# భూములుపోతె.. బతికేదెట్లా?

- ఇప్పటికే రోడ్డు కోసం లక్షల విలువైన జాగాపోయింది
- త్రిబుల్ ఆర్ కోసం ఉన్న భూమిపోతుంది
- ఈ ఊర్లింకా..మాకేముంటది?: సామలపల్లి గ్రామస్తులు


సామలపల్లి గ్రామం వ్యూ


అధికారులతో గోడు వెల్లబోసుకుంటున్న గ్రామస్తులు

వర్గల్, ఫిబ్రవరి 26: ఇది వర్గల్ మండలం సామలపల్లి. కాయకష్టానికి కల్మషం లేని మాటముచ్చటకు పెట్టింది పేరు. తెలంగాణ సాధన కోసం రోడ్డుపై బైఠాయించి, మూకుమ్మడి గొంతు కలిపి గర్జించిన గ్రామం. ఇప్పుడు త్రిబుల్ ఆర్ రోడ్డు భయంతో తమకు బువ్వ బెట్టే భూములుపోతున్నాయని బెంగతో సామలపల్లి గ్రామస్తులు బిక్కుబిక్కుమంటున్నారు. రియల్ ఎస్టేట్ ఊపు మీదున్న కాలంలో రోడ్డుకు ఆనుకుని ఉన్న భూమికి ఎకరాకు రూ.2 కోట్లు పలికినా, తమకు పైసాకంటే కడుపునింపే భూమే ప్రాణమని నమ్మిన గ్రామం. రోడ్ల విస్తరణ, కాల్వల పేరిట నష్టపోయిన వారికి, ఇప్పుడు అధికారులు ట్రిపుల్ ఆర్ కోసం భూసేకరణ పనులు చేపట్టడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఎకరా, రెండెకరాలు, మూడెకరాలు ఉన్న కాడికి మొత్తం భూమి పోతున్న కుటుంబాలు కూడా ఉండటంతో భూమి డిమాండ్‌కు తగిన నష్టపరిహారం ఇవ్వాలని కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. 107 కుటుంబాలున్న సామలపల్లిలో ఓఆర్ఆర్ విస్తరణలో భాగంగా దాదాపు సగానికి పైగా కుటుంబాలకు చెందిన భూ బాధితులున్నారంటే అతిశయోక్తికాదు. కోట్ల భూమికి లక్షలు ఇస్తానంటే ఎట్లా? అంటున్నారు. సర్కారు తమ సమస్యలను పరిష్కరించాకే భూములు తీసుకోవాలని, లేదంటే మార్కెట్ ధరను తమ భూములకు కట్టివాలని సామలపల్లి గ్రామస్తులు కోరుతున్నారు. లేదంటే భూములిచ్చేదే లేదంటున్నారు.

గ్రామం: సామలపల్లి
మండలం: వర్గల్
జిల్లా: సిద్దిపేట
జనాభా: 550
మొత్తం ఓటర్లు: 301
కుటుంబాలు : 107
ఇండ్లు : 70

### ఉన్నకాడికి పోతున్నది



మాకు ఉన్న భూమే రెండెకరాల 19 గుంటలు. అదికూడా రోడ్డు కోసం పోతున్నది. ఇంకా బతికేదెట్లా? మొన్ననే ఇల్లులేదని ఆడా ఈడా రూ.30 లక్షలు అప్పుజేసి రోడ్డుపక్కనే ఇల్లుకట్టుకున్న. ఉన్న భూమి పోతున్నది, కట్టిన ఇల్లుపోతున్నది. ఇంకెందుకు బతకాలె?
- మైసగౌని ఆగమయ్య, రైతు, సామలపల్లి

### మూడెకరాల భూమి పోతున్నది



పదో తరగతి చదువుకుని ఎవుసం చేస్తున్న. ఎంత సదివినా ఉద్యోగాలు రావని భూమిని నమ్ముకున్న. త్రిబుల్ ఆర్ రోడ్డులో ఎకరం మీదనే పోతున్నది. మూడు కోట్లకు వస్తె అమ్మలేదు. భూమి రోడ్డు పనులకుపోతున్నది. ప్రభుత్వం బయట ధర ఇచ్చి తీసుకుంటే బాగుండు. - చీరాల రమేశ్, యువరైతు, సామలపల్లి

### నష్ట పరిహారం పెంచాలి



రియల్ ఎస్టేట్ హవాలో ఎకరాకు రూ.3 కోట్లకు పైగా ధర పలికినా ఏ ఒక్కరూ భూమి అమ్మలేదు. భూమే వారికి బతుతుదెరువు అనే నమ్మకంతో ఇన్నాళ్లు బతికారు. ఇప్పుడు త్రిబుల్ ఆర్ నిర్మాణం వారికి ప్రాణగండం అయ్యింది. రైతులకు నచ్చేలా నష్టపరిహారం ఇవ్వాలి. - రమేశ్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకుడు

### భూమి అమ్మి పెండ్లీళ్లు చేద్దామనుకున్నం



అన్నదమ్ముళ్ల ఇద్దరికీ ఇద్దరు బిడ్డలు. అయ్యవ్వ సంపాదించిన భూములు కాపాడుకున్నం. మా నలుగురు బిడ్డల లగ్గాలు భూమి అమ్మి చేద్దామనుకున్నం. త్రిబుల్ ఆర్ రోడ్డు మా భూమి మీదుగానే పోతున్నది. భూములుపోతే మా బతుకులు పోయినట్టె.
- తగిళ్ల మల్లేశం, రైతు, సామలపల్లి

## సిద్ధిరామేశ్వరాలయంలో ఎమ్మెల్సీ శేరి పూజలు


సిద్ధిరామేశ్వరాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి దంపతులు

మెదక్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి దంపతులు హవేళీ ఘనపూర్ మండలం ముత్తాయి కోటలోని సిద్ధిరామేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శేరి సుభాష్ రెడ్డి దంపతులకు ఆలయ కమిటీ సభ్యులు, ప్రధాన పూజారి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం రుద్రాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.

## రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి


### బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు కిరణ్



మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 26: ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు కిరణ్ బుధవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సుమారు రూ.8,500 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. 14 నెలల కాంగ్రెస్ పాలనలో నేటి వరకు ఒక్క రూపాయి విడుదల చేయలేదన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు తమ కళాశాలల్లో ప్రవేశాలు పొందాలని బ్రోకర్ల ద్వారా గ్రామాలు, పట్టణాల్లో ప్రచారం చేస్తున్నారన్నారు. విద్యా హక్కు చట్టాన్ని పూర్తిస్థాయిలో ప్రభుత్వం అమలు చేయాలని, విద్యాసంస్థల్లో ఫీజల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు.

# ఘనంగా ఏడుపాయల జాతర ప్రారంభం


పట్టు వస్త్రాలు సర్పించి మొక్కుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ


మంజీరా నదిలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన శంకరుడి విగ్రహం


ఆలయం వద్ద షవర్ల కింద పుణ్య స్నానాలు చేస్తున్న భక్తులు

- వనదుర్గామాతకు పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి దామోదర రాజనర్సింహ
- భారీగా తరలివచ్చిన భక్తులు
- మొదటి రోజు ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులు

పాపన్నపేట, ఫిబ్రవరి 26: జానపదుల జాతరగా పేరుగాంచిన ఏడుపాయల జాతర బుధవారం ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రారంభించారు. రాష్ట్ర నలుమూల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ నుంచి వేలాదిమంది భక్తులు ఏడుపాయలకు తరలివచ్చారు. మంజీరా నదిలో పుణ్యస్నానాలు చేసి అమ్మవారి సన్నిధిలో ఉపవాస దీక్షలు చేపట్టారు. సాయంత్రం అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని దీక్షలు విరమించారు.

### జాతరకు రూ.2 కోట్లు కేటాయింపు

ప్రతి ఏడాది లాగే ఈసారి కూడా ప్రభుత్వం ఏడుపాయల జాతర నిర్వహణకు రూ.2 కోట్లను కేటాయించింది. జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం విద్యుత్తు, తాగునీరు, వైద్యంతో పాటు అన్ని రకాల సేవలు కల్పించారు. ముఖ్యంగా మంజీరా నదిలో ప్రమాదాలు జరగకుండా పెద్ద ఎత్తున గజ ఈతగాళ్లను నియమించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో వసతులు కల్పించారు. స్నానాల కోసం ఇటీవలి సింగూరు ప్రాజెక్టు నుంచి మంజీరాకు 0.35 టీఎంసీల నీటిని వదిలారు. దీంతో స్నానాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అయ్యింది. చుట్టుపక్కల జిల్లాల నుంచి ఏడుపాయలకు పెద్దసంఖ్యలో ఆర్టీసీ బస్సులు నడుపుతున్నారు.

### సర్వాంగ సుందరంగా ఆలయం ముస్తాబు

దుర్గామాత ఆలయాన్ని రంగురంగుల పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయం ఎదుట భారీగా తాత్కాలిక శివుడి విగ్రహం ఏర్పాటుచేశారు. జాతరను పురస్కరించుకుని అమ్మవారికి బంగారు కిరీటం, ఆభరణాలను పెట్టి అలంకరించారు. దీంతో అమ్మవారి విగ్రహం ధగధగలాడుతున్నది.

### ప్రజలు సంతోషంగా ఉండాలని మొక్కుకున్నా: మంత్రి

ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని దుర్గామాతను మొక్కుకున్నట్లు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. వన దుర్గామాతకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జాతర నిర్వహణకు రూ.2 కోట్లు మంజూరు చేసిందన్నారు. జాతరకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు చేపట్టామన్నారు.

### పకడ్బందీగా నిఘా

మూడు రోజుల పాటు జరిగే జాతరకు సుమారు 15 లక్షల మంది భక్తులు హాజరుకానున్నారు. దీంతో సుమారు 850 మంది పోలీసులతో బందోబస్తు చర్యలు చేపట్టారు. ఏడుపాయల మొత్తం సీసీ కెమెరాల నిఘాలో ఉన్నట్లు పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

## ఘనంగా మహేశ్‌గుప్తా పుట్టిన రోజు


అభిమానుల మధ్య కేక్ కట్‌చేస్తున్న మాజీ జడ్పీటీసీ పబ్బమహేశ్‌గుప్తా

శివ్వంపేట, ఫిబ్రవరి 26: మాజీ జడ్పీటీసీ పబ్బమహేశ్ గుప్తా పుట్టినరోజును శివ్వంపేటలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పీఎంజీ యువసేన ఆధ్వర్యంలో మాజీ జడ్పీటీసీ పబ్బమహేశ్‌గుప్తా 46వ పుట్టిన రోజు కోలాహలంగా నిర్వహించారు. శివ్వంపేటలో రూ.లక్షతో దుర్గాభవానీ ఆలయాన్ని ఆధునీకరించి, ప్రారంభించారు. లింగోజిగూడలో గుడిసె కాలిపోయిన బాధితులకు రూ.5 వేలు, నిత్యావసర సరుకులు అందజేశారు. మగ్దుంపూర్‌లోని బేతని సంరక్షణాలయంలో అనాథ విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. శివ్వంపేటలోని ప్రతి ఇంటికీ కుంభమేళా నుంచి తీసుకొచ్చిన నీటిని అందజేశారు. ఈ సందర్భంగా పబ్బ మహేశ్‌గుప్తా మాట్లాడుతూ ప్రజలకు ఏదైనా ఆపద వస్తే నేనున్నానంటూ తక్షణమే స్పందించి ఆదుకుంటానన్నారు. సేవ చేస్తేనే తృప్తి కలుగుతుందని, అందుకే తన సంపాదనలో సగభాగం సేవా కార్యక్రమాలకే ఉపయోగిస్తానన్నారు. కార్యక్రమంలో పీఎంజీ యువసేన సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, అభిమానులు ఉన్నారు.

## కొప్పోల్ ఆలయ అభివృద్ధికి కృషిచేస్తా


కొప్పోల్ ఆలయంలోపూజలు చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 26: కొప్పోల్ ఉమాసంగమేశ్వర ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన కొప్పోల్ ఉమా సంగమేశ్వర ఆలయంలో స్వయంభు లింగానికి ఎమ్మెల్యే సంజీవరెడ్డి దంపతులు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. పూజారులు ఎమ్మెల్యే దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కొప్పోల్ ఆలయానికి బీటీ రోడ్డు మంజూరయిందని, టెండర్లు ఆహ్వానించి, త్వరలో పనులు పూర్తి చేస్తామన్నారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన హెల్త్, పోలీస్, రెవెన్యూ క్యాంపులను పరిశీలించి, జాతర ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆలయ కమిటీ సభ్యులు పద్మ బాపిరాజు, రాజశేఖర్‌రెడ్డి, శంకరయ్య, పరమేశ్వర్‌రెడ్డి, మధు, నాయకులు నారాగౌడ్, సంగమేశ్వర్, సుభాశ్‌గౌడ్, పెరుమాండ్లుగౌడ్, రాజేందర్ గౌడ్, సాయిరెడ్డి,రఘుపతిరెడ్డి ఉన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి


వెల్దుర్తి: పోలింగ్ సామగ్రితో కేంద్రానికి చేరుకున్న పోలింగ్ సిబ్బంది


నర్సాపూర్: కేంద్రానికి చేరుకున్న సిబ్బంది, ఎస్సై, పోలీసులు

- ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి
- కలెక్టర్ రాహుల్‌రాజ్
- డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను సందర్శించి, పోలింగ్ సామగ్రి పంపిణీ
- గ్రాడ్యుయేట్ పోలింగ్ కేంద్రాలు 22, టీచర్స్ కేంద్రాలు 21


నర్సాపూర్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలింగ్ కేంద్రం

మెదక్, (నమస్తే తెలంగాణ)/నర్సాపూర్/చేగుంట/వెల్దుర్తి/పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 26: జిల్లా పరిధిలో మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరగనున్న పోలింగ్ నేపథ్యంలో బుధవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ సిబ్బంది ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రిని అందజేశారు. వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఎన్నికల్లో టీచర్స్‌కు 21, గ్రాడ్యుయేట్స్‌కు 22 పోలింగ్ కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయన్నారు.

### ఎన్నికల నిబంధనలు పాటించాలి

ఎన్నికల నిబంధనను పోలింగ్ సిబ్బంది పూర్తిగా అవగాహన చేసుకుని విధులు నిర్వహించాలన్నారు. ఓటింగ్ గోప్యతను కచ్చితంగా పాటించాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. తాగునీటి వసతి, వైద్య శిబిరం, అల్పాహారం, భోజన వసతి, షామియానాలు వంటి అన్ని వసతులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఉపాధ్యాయ ఓటర్లు 1347, గ్రాడ్యుయేట్ ఓటర్లు12,472 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. పోలింగ్ సిబ్బంది 43 మంది పీవోలు, 43 మంది ఏపీవోలు, 86 మంది ఓపీవోలు, 22 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించారు. ప్రతి మూడు పోలింగ్ స్టేషన్స్‌కు ఒక రూట్ చొప్పున 8 రూట్లు ఏర్పాటుచేశారు. సెక్టోరియల్ అధికారులు 8 మంది నియమించారు.

### అన్ని సౌకర్యాలు కల్పించాలి

తాగునీరు, విద్యుత్, ఫర్నిచర్, మూత్రశాలలు, అన్ని పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశారు. జిల్లాలో మొత్తం 22 గ్రాడ్యుయేట్స్, 21 టీచర్స్ నియోజకవర్గ పోలింగ్ కేంద్రాల్లో గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ ప్రక్రియ పూర్తి కాగానే ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్ కరీంనగర్‌కు వెబ్ కాస్టింగ్ పోలింగ్ సిబ్బందితో పాటు బ్యాలెట్ బాక్సులతో సంబంధిత అధికారులకు అందజేయాలని సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ నగేశ్, అడిషనల్ ఎస్పీ మహేందర్, ఆర్డీవోలు తూప్రాన్ జయచంద్రారెడ్డి, నర్సాపూర్ మహిపాల్‌రెడ్డి , డీఈవో రాధా కిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


వెల్దుర్తి: మాసాయిపేటలో సూచనలిస్తున్న ఆర్డీవో జయచంద్రారెడ్డి



పెద్దశంకరంపేటకు చేరుకున్న ఎన్నికల సిబ్బంది

## అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


హలవత్ గణేశ్ (ఫైల్)

నర్సాపూర్, ఫిబ్రవరి 26: కూతురు పెండ్లికి చేసిన అప్పు తీర్చలేక చెట్టుకు ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని తుజాల్‌పూర్ గ్రామం అర్జుతండాలో బుధవారం జరిగింది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తుజాల్‌పూర్ పంచాయతీ అర్జుతండాకు చెందిన హలవత్ గణేశ్ (42) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రెండేండ్ల క్రితం కూతురు పెండ్లికి అప్పు చేశాడు. అప్పు ఎలా తీర్చాలో తెలియకక మనోవేదనకు గురయ్యేవాడు. తన కుటుంబ సభ్యులతో చెబుతూ బాధపడేవాడు. బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించారు. ఇంటికి కొద్ది దూరంలోని హలవత్ కోటి వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడి భార్య హలవత్ సాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లింగం తెలిపారు.

## మెదక్ చర్చి ప్రెసిబెటరీ మాజీ ఇన్‌చార్జి రాబిన్‌సన్ మృతి


రాబిన్‌సన్ (ఫైల్)

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 26: మెదక్ చర్చిలో ప్రెసిబెటరి ఇన్‌చార్జిగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన రాబిన్‌సన్ (71) అనారోగ్యంతో మెదక్‌లోని ప్రైవేట్ దవాఖానలో బుధవారం మృతి చెందారు. రాబిన్‌సన్ చర్చిలో 2010 నుంచి 2019 వరకు ప్రెసిబెటరీ ఇన్‌చార్జిగా విధులు నిర్వహించారు. మెదక్ అధ్యక్ష మండలంలో వైస్ చైర్మన్‌గా, మినిస్ట్రియల్ కన్వీనర్, తదితర పదవుల్లో పనిచేశారు. రాబిన్‌సన్ అకాల మృతికి ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్లు బట్టి జగపతి, మల్లికార్జున్‌గౌడ్, చంద్రపాల్, చర్చి కమిటీ సభ్యులు గంట సంపత్, జాన్సన్, సువణ్‌డగ్లస్, జాయ్‌ముర్రే సంతాపం వ్యక్తం చేశారు. గురువారం చర్చి కాంపౌండ్‌లోని క్రైస్తవ స్మశాన వాటికలో అంత్రక్రియలు జరుగనున్నాయి.

## ఆకులే గొడుగుగా...



చేగుంట, ఫిబ్రవరి 26: మహా శివరాత్రిని పురస్కరించుకుని చేగుంటలో మామిడి ఆకులు, పండ్లు ఫలాలు, పువ్వులు విక్రయిస్తున్న వ్యక్తి ఎండ తాపాన్ని తట్టుకునేందుకు ఆకులను గొడుగులా చేసి ఉపశమనం పొందాడు.




| S.No. | అభ్యర్థి పేరు | అభ్యర్థి ఫోటో | ప్రాధాన్యత ఓటు |
|---|---|---|---|
| 1 | | | |
| 2 | అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి వూటుకూరి<br>ఇండియన్ నేషనల్ కాంగ్రెస్<br>ALPHORES NARENDER REDDY VOOTUKURI<br>Indian National Congress | | 1 |